ప్రజాశక్తి

సోమవారం 14 ఏప్రిల్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరు

● సిఆర్‌డిఎ పరిధిలోకి ముడాకు ప్రణాళికలు ● మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : గేట్ వే ఆఫ్ అమరావతిగా మచిలీపట్నాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లాలోని ముడా పరిధిని సిఆర్‌డిఎ రాజధాని పరిధిలోకి తీసుకువచ్చేవిధంగా ప్రణాళికలు రూపొందించామని చేశామని, త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి దీనిని కార్యరూపంలోకి తీసుకొస్తామని చెప్పారు. మచిలీపట్నంలోని జడ్‌పి కన్వెన్షన్ హాల్లో మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం "బంగారు బందరు" సాకారం కోసం పుర ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బందరు అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈసమావేశంలో కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొని నగరాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. వ్యాపారవేత్తలు, న్యాయ, వైద్య తదితర రంగాలకు చెందిన ప్రముఖులు నగరాభివృద్ధికి తమ విలువైన సలహాలు, సూచనలు తెలియజేశారు. అనంతరం మంత్రి కొల్లు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి రెండో మున్సిపాలిటీగా ఘనమైన చరిత్ర కలిగిన మచిలీపట్నం తర్వాతి కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ, చెన్నై, ముంబై, కోల్‌కతా వంటి పోర్టులు బందరు పోర్టు తర్వాత ఏర్పడినా అవి అభివద్ధి చెందాయని, కానీ శతాబ్దాల క్రితమే పడవల తయారీకి నెలవుగా ఉండి బ్రిటీష్ కాలంలో అత్యంత వైభవంగా వెలుగొందిన బందరు పోర్టు వెనుకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అవకాశాలను (మిగతా 2లో)

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

'సమైక్యతా శంఖారావం' సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సాహితీవేత్త, ఎఐసిసి మైనారిటీ విభాగం చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ ఘడి

మతాన్ని పునాదిగా చేసుకునే ప్రభుత్వాల

పతనం తప్పదు

● సమైక్యతా శంఖారావం సభలో వక్తలు వార్త మెయిన్‌లో

కృష్ణా కలెక్టర్ బాలాజీ అభినందనలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కష్ణాజిల్లా ప్రథమ స్థానంలో నిలిచేలా కషి చేసిన విద్యాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలెక్టర్ డి.కె.బాలాజీ ఒక ప్రకటనలో అభినందించారు. వచ్చే ఏడాది కూడా ఇలాగే మరింత మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. శనివారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కృష్ణాజిల్లా విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 93 శాతం మంది, మొదటి సంవత్సరంలో 85 శాతం మంది ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో కృష్ణాజిల్లాను మొదటి స్థానంలో నిలిపిన విషయం తెలిసిందే.

స్మార్ట్ మీటర్లు తప్పనిసరి

● ఇప్పటికే 80 వేల మీటర్లు బిగించాం
● విజయవాడ నగర పరిధిలో 50 వేల వరకు ఏర్పాటు
● ప్రభుత్వ బకాయిలు రూ.381 కోట్లు జమ
● పెండింగ్ బకాయిలు రూ.200 కోట్లు
● వేసవిలో 13 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం
● ప్రజాశక్తితో విద్యుత్ విజయవాడ సర్కిల్ ఎస్ఇ సాంబశివరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఎప్పటికైనా గృహాలకు, ఇతర అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు పూర్తి స్థాయిలో స్మార్ట్ మీటర్లు బిగించాల్సిందేనని ఎలక్ట్రికల్ విజయవాడ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఇ) ఎం.సాంబశివరావు చెప్పారు. ఇప్పటికే తమ సర్కిల్ పరిధిలోని 26 మండలాల్లో కమర్షియల్, ఇండ్రస్టియల్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించామని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 80 వేల కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు తెలిపారు. వీటిలో 10 శాతం కనెక్షన్లు ఇండ్రస్టియల్‌వి కాగా, మిగిలినవి కమర్షియల్ కనెక్షన్లని తెలిపారు. ఒక్క విజయవాడ నగరంలోనే 50 వేల వరకు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు ఎస్ఇ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇంకా రూ.200 కోట్ల వరకు విద్యుత్ బకాయిలు రావాల్సి ఉందన్నారు. అయితే ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న రూ.381 కోట్లను ప్రభుత్వం గత నెల 25న విడుదల చేసిందని చెప్పారు. విజయవాడ సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగం, దాని పరిస్థితిపై ప్రజాశక్తికి ఎస్ఇ సాంబశివరావు ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న : అకాల వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ అంతరాయం కలగకుండా తీసుకుంటున్న చర్యలేమిటి ?

ఇటీవల వీచిన ఈదురుగాలులు, అకాల వర్షాలకు అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు వాలిపోయాయి. కొన్ని విరిగిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు దెబ్బతిన్నాయి. ట్రిప్ అయిన కారణంగా కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మా క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మరమ్మతులు చేసి త్వరగా విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నాం. విజయవాడ రూరల్, నూజివీడు ప్రాంతాల్లో పడిపోయిన 50 స్తంభాలను పునరుద్ధరించాం.

ప్రశ్న : వేసవిలో, సాధారణ రోజుల్లో విద్యుత్ వినియోగం ఎంత ఉంటుంది ?

వేసవిలో 13 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉంది. సాధారణ రోజుల్లో అయితే 10 నుంచి 11 మిలియన్ యూనిట్లు ఉంటుంది. వేసవిలో రెండు మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం అదనంగా ఉంది.

ప్రశ్న : విజయవాడ సర్కిల్ పరిధిలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లున్నాయి?

విజయవాడ నగరంతోపాటు 26 మండలాల పరిధిలో మొత్తం 12 లక్షల విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటిలో గృహ కనెక్షన్లు 9.65 లక్షలు, కమర్షియల్ కనెక్షన్లు 1.36 లక్షలు, పరిశ్రమలకు 6,400 కనెక్షన్లు, ప్రార్థనా మందిరాలు, వీధి దీపాల కనెక్షన్లు 14,075, వ్యవసాయ కనెక్షన్లు 95 వేలు ఉన్నాయి.

ప్రశ్న : ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు ఎంత పెండింగ్‌లో ఉన్నాయి ?

విద్యుత్ రంగానికి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల్లో ఇటీవల కొన్ని నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పంచాయతీలు, ఇతర రూపాల్లో వాడుకున్న విద్యుత్‌కు ప్రభుత్వం తమ సర్కిల్ పరిధిలో ఇంకా రూ.200 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఎప్పటి నుంచో ఉన్న బకాయిల్లో రూ.381 కోట్లను ప్రభుత్వం గత నెలలో చెల్లించింది.

ఉపాధి వేతనాలు పెండింగ్

● 52 రోజులుగా జమకాకపోవడంతో కార్మికుల అవస్థలు
● రూ.32 కోట్లకుపైగా బకాయిలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. రెక్కాడితేగానీ డొక్కాడని గ్రామీణ ఉపాధి కార్మికులకు సకాలంలో వేతనాలు జమ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. 52 రోజులైనా వేతనాలు జమ చేయకపోవడంతో పనికెళ్లినా పస్తులుండాల్సి పరిస్థితి ఏర్పడిందని ఉపాధి కార్మికులు వాపోతున్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లికి చెందిన పల్లెకొండ గాబ్రియేలు, యార్రా లక్ష్మయ్య కుటుంబాలు రోజువారీగా రెక్కలు కష్టంతోనే పొట్టనింపుకుంటాయి. డొంక రోడ్ల మరమ్మతులు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే పనులను 35 రోజులు వెళ్లారు. కానీ 52 రోజులైన వేతనాలు బ్యాంక్ ఖాతాలో జమకాలేదు. అప్పులు తీసుకు వచ్చి కుటుంబాలను పోషించుకోల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ గ్రామంలో మరో 17 కుటుంబాలదీ ఇదే పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా ఈ సమస్య ఉంది.

రూ. 32 కోట్లు పెండింగ్

కార్మికులు చేసిన పని వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. ఇలా వారంలో చేసిన పనికి సంబంధించి డబ్బులు వచ్చే వారంలోగా జమ చేయాలి. 52 రోజులుగా జమ చేయకుండా పనిచేసిన వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోంది. జిల్లావ్యాప్తంగా 12 లక్షల 20 వేల 628 పనిదినాలకు సంబంధించి రూ.32 కోట్లు కార్మికుల ఖాతాలో జమ చేయాల్సి ఉంది.

జిల్లాలో 2,14,704 జాబ్ కార్డులుండగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 75 లక్షల పనిదినాలను ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఏప్రిల్‌లో రోజువారీ సగటున 76 వేల మంది పనులు చేస్తున్నారు. త్వరలోనే రోజువారీ పనులకు వెళ్లే వారి సంఖ్య 1.26 లక్షలకుపైగా చేరుతుందని అంచనా. ఆర్థిక సంవత్సరం మొదలైన పది రోజుల్లోనే 2 లక్షల పని దినాలు పూర్తయ్యాయి. ప్రధాన పంటలు వరి, అపరాలు పంటల నూర్పిడిల్లో ప్రతి ఏటా యాంత్రీకరణ పెరిగిపోతోంది. ప్రస్తుతం ఖరీఫ్, రబీ వ్యవసాయ పనులు ముగిశాయి. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులకు రోజువారీ పని దొరకడం కష్టంగా మారింది. ప్రత్యామ్నాయం లేక కుటుంబ పోషణకు వ్యవసాయ కార్మికుల్లో ఎక్కువ మంది ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. అయితే సకాలంలో వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం ఉపాధి కార్మికులను ఆందోళనకు గురిచేస్తోంది.

రబీ ధాన్యం కొనుగోలుకు చర్యలు

●ఇప్పటికే రూ.18.81 కోట్ల విలువైన 9,223 టన్నులు కొనుగోలు

●24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ●కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : రబీ (2024-25) సీజన్‌కు సంబంధించి ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడ రూరల్ నున్న సమీపంలోని పోలవరం కెనాల్ బండ్ ప్రాంతాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. రైతుల ధాన్యం రాశులు, బస్తాలను కలెక్టర్ పరిశీలించారు. పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లు సమక్షంలో ధాన్యం తేమ శాతాన్ని, ధాన్యాన్ని లారీలకు ఎక్కించి, మిల్లులకు తరలించే ప్రక్రియను పరిశీలించారు. 45 లారీలకు ఇండెంట్ పెట్టామని, అదనంగా లారీలను ఏర్పాటుచేసి సోమవారం సాయంత్రంలోగా మొత్తం ధాన్యాన్ని తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,66,470 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 38,667 టన్నుల ధాన్యం కోతలు జరిగాయని, వచ్చిన ధాన్యాన్ని ఆర బెట్టుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే పౌర సరఫరాల శాఖ ద్వారా 601 మంది రైతుల నుంచి రూ.18.81 కోట్ల విలువైన 9,223 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమవుతోందన్నారు. రైతులకు ఇబ్బందిలేకుండా 4.20 లక్షల గోనె సంచులను సిద్ధంగా ఉంచామని, 143 వాహనాలు, 1,070 మంది హమాలీలు కూడా అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సగటున 900-1,100 టన్నుల ధాన్యం సేకరణ జరుగుతోందని, జిల్లావ్యాప్తంగా 107 రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కె) ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. టార్పాలిన్లను కూడా ఆర్ఎస్‌కెల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ట్యాగ్ చేసిన 17 మిల్లులకు తహశీల్దార్లను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. లోడింగ్‌కు, అన్‌లోడింగ్‌కు మధ్య సమయం 10 గంటలకు మించకుండా ఆదేశాలు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. మద్దతు ధరలో ఇష్టం వచ్చినట్లు కోత పెట్టి నిబంధనలు ఉల్లంఘించే మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాస్థాయిలో 77020 03571 నంబరుతో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని తెలిపారు. 73373 59375 వాట్సాప్ నంబరుకు హాయ్ అని మెసేజ్ పెడితే చాలు ధాన్యం కొనుగోలు చేసే సేవలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఏ కేంద్రంలో, ఏ రోజు, ఏ సమయంలో, ఏ రకం ధాన్యం అమ్మదలచుకున్నారో మెసేజ్ ఇస్తే స్లాట్ బుక్ అవుతుందని తెలిపారు. ఏఐ వాయిస్ ఓవర్‌తో రైతులకు దారిచూపుతూ వాట్సాప్‌లో తేలిగ్గా ధాన్యం కొనుగోలు షెడ్యూల్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కలెక్టర్ వెంట పౌర సరఫరాల జోనల్ మేనేజర్ జి.శిరీష, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ముత్యాల శ్రీనివాస్, వీఏఏ కె.మౌనిక తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా

నూతన గీతం ఆవిష్కరణ

విజయవాడ : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రంగం ప్రజా సాంస్కృతిక వేదిక వ్యవస్థాపక సభ్యుడు, ప్రజా గాయకుడు చల్లా శ్రీనివాస్ రచన, స్వరకల్పన గానంలో అంబేద్కర్‌పై సరికొత్త గీతాన్ని ఆదివారం ఆవిష్కరించారు. విజయవాడలోని రంగం కార్యాలయంలో ఏబిఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర నాయకులు పంతగాని రమేష్ ఈ గీతాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర నాయకులు దళిత నాయకులు శ్రీశ్రీ గడ్డం విజయరావు, రాష్ట్ర కార్యదర్శి, కళారత్న రంగంరాజేష్ మాట్లాడారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చిన్నా అమత పుట్టినరోజు సందర్భంగా ఆదివారం భవానీపురంలో మజ్జిగ పంపిణీ చేశారు. హెచ్‌బి కాలనీ షారోన్ చర్చి సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్ ఎం.పరిశుద్ధబాబు, సంఘస్తులు పాల్గొన్నారు.

నేడు విఎంసిలో ప్రజా ఫిర్యాదుల: పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - విజయవాడ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సెలవు రోజు అయినందున కార్పొరేషన్, ప్రధాన, జోనల్ కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించడంలేదని విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

చల్లబడిన వాతావరణం

బలంగా ఈదురుగాలులు

కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరం ఒక్క సారిగా చల్లబడింది. గత రెండు రోజులుగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయిన నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండ తీవ్రతకు రోడ్లన్నీ నిర్మానుషంగా మారాయి. ఒక్క సారిగా ఆదివారం సాయంత్రం వాతావరణం చల్లబడి, చల్లని గాలులు వీయడంతో ప్రజలకు ఉపశమనం కల్గింది. దీంతో పాటు బలమైన ఈదురుగాలలు వీచాయి. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్లలో బోర్డులు దెబ్బతిన్నాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. భారీ స్థాయి ఫ్లెక్సీలు చిందరవందర అయ్యాయి. అక్కడక్కడ చెట్ల కొమ్మలు, వీధుల్లో, రోడ్ల పై ద్విచక్రవాహనాపై ప్రయాణించడం, నడవటం నగర వాసులకు ఇబ్బందిపడాల్సి వచ్చింది. దుమ్ము, ధూళితో ముందుకు సాగడం కష్టంగా తయారయింది. వన్‌టౌన్ ప్రాంతంలో ముందస్తు జాగ్రత్తగా 8.30 గంటల సమయములో విద్యుత్‌ను ఆపేశారు. ఈదురు గాలికి నగర వాసులు పలురూపాల్లో ఇబ్బందులు పడక తప్పలేదు. చిరు వ్యాపారుల వృత్తిపై కూడా ప్రభావం చూపింది. సాయంత్రం సమయములో ఉరుములు-మెరుపులతో ప్రజలు ఒకింత భయానికి లోనయ్యారు.

సహకార రంగంలో రెండంచెల విధానం అమలు చేయాలి

ఎపి సిసిబిఇఎ వజ్రోత్సవాల సభలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ : సహకార రంగ బ్యాంకుల బలోపేతం, గ్రామీణ వ్యవసాయ రంగ ప్రయోజనాల కోసం రెండంచెల విధానం(టు టైర్) ప్రవేశపెట్టాలని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దష్టి సారించాలని వక్తలు ఉద్ఘాటించారు. గ్రామీణ వ్యవసాయ మౌలిక సౌకర్యాల కల్పన కోసం రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని, సహకార సూత్రాలను ఖచ్చితంగా అమలు చేయాలని, గ్రామీణ వ్యవసాయ, రైతాంగానికి సేవలందిస్తున్న సహకార సంస్థలకు ఆదాయపన్ను చట్టం సెక్షన్ 80(సీ) నుంచి పన్ను మినహాయింపు ఇవ్వాల్నారు. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ సీసీబీఈఏ) వజ్రోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. సభా ప్రాంగణంలో సంఘం జెండాను వ్యవస్థాపక నాయకులు చలసాని మాధవరావు ఆవిష్కరించారు. ఛాయాచిత్ర ప్రదర్శనను జాతీయ సీనియర్ నాయకులు, ఏఐబిఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటా చలం ప్రారంభించారు. ఈ వేడుకలను ఆహ్వాన సంఘం చైర్మన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, ఆల్ ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం, ఏపీ, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు, ఆప్కాబ్ పూర్వపు చైర్మన్లు టీడీ జనార్ధన్‌రావు, విజయేందర్‌రెడ్డి, మల్లెల ఝాన్సీరాణి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, నాయకులు వెలుగూరి రాధాకష్ణమూర్తి, అసోసియేషన్ నేతలు, సహకార రంగ ఉద్యమకారులు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. సీపీఐ నేత కె.రామకష్ణ స్వాగతోపన్యాసం చేశారు. ఆప్కాబ్ పూర్వపు చైర్మన్ టీడీ జానార్ధన్ మాట్లాడుతూ, సహకార రంగంలో తొమ్మిదేళ్లపాటు సేవలందించే అవకాశం దక్కడం తనకు అదష్టంగా భావిస్తున్నానని తెలిపారు. సభా వేదికపైన వెలుగూరి రాధాకష్ణమూర్తి సహకార రంగంపై రచించిన 'కొన్ని జ్ఞాపకాలు' పుస్తకాన్ని నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా సంఘం కార్యకలాపాల సావనీర్‌ను విడుదల చేశారు. 70 మంది సీనియర్ నాయకుల్ని సత్కరించారు. ఆప్కాబ్ పూర్వ అధ్యక్షులు విజయేంద్ర రెడ్డి, మల్లెల ఝాన్సీ రాణి సందేశం ఇచ్చారు. సంఘం ప్రధాన కార్యదర్శి కె వి ఎస్ రవి కుమార్, ఉపాధ్యక్షులు వెలుగూరి రాధా కష్ణ, మాట్లాడారు. భారతీ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ జిల్లాలకు చెందిన ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరు

(మొదటి పేజీ తరువాయి)

అందిపుచ్చుకుని ముందుకు సాగాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో విద్య, వైద్య, ఉపాధి రంగాలను అభివద్ధి చేసి బందరుకు సరికొత్త రూపం ఇవ్వనున్నామన్నారు. గిలకలదిండి కరగ్రహారం గ్రామాల మధ్య ప్రాంతంలో 300 ఎకరాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కు నిర్మాణం, ఆక్వా సంబంధిత పరిశ్రమలు, అనుకరణ ఆభరణాల తయారీ, కలంకారీ, పడవల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు భారీఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి బందరు పోర్టు మొదటి దశ నిర్మాణం పూర్తి కానుందన్నారు. త్వరలో పోర్టు రవాణా కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. పోర్టు ఆధార పరిశ్రమలు ఏర్పాటు ద్వారా యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మచిలీపట్నం - రేపల్లె మధ్య రైల్వే లైన్ ఏర్పాటుకు డిపిఆర్ సిద్ధం చేస్తున్నామని, దీనికి బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి ఎంతో కషి చేస్తున్నారని చెప్పారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా మంగినపూడి బీచ్ అభివద్ధిపై ప్రత్యేక దష్టి సారించామని తెలిపారు. మొదటి విడతలో బీచ్‌ను రూ.120 కోట్లతో అభివద్ధి చేయడానికి ప్రాణాళికలు రూపొందించామన్నారు. సముద్రం వెంబడి రక్షణ గోడ నిర్మించనున్నామన్నారు. మేలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే జిల్లాలోని క్రీడాకారులందరికీ ఉపయోగపడే విధంగా అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, ఇతర క్రీడల కోర్టుల నిర్మాణానికి మచిలీపట్నం గోసంఘం సమీపంలో సుమారు రూ.50 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా రహదారులకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించామని చెప్పారు. రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, దీనిని అధిగమించేందుకు మంగినపూడి బీచ్ ప్రాంతంలో 10 ఎకరాలు కేటాయించి, పట్టించుకోని పశువులను అక్కడికి తరలిస్తామని తెలిపారు. జాతీయ కళాశాల సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపునకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. రోజుకు సరాసరి 90 టన్నులకు పైగా వస్తున్న చెత్తను ఇకనుంచి ఏరోజుకారోజు తరలించే విధంగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఎపిఎస్ ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ జిల్లా అభివద్ధికి ఎన్నో పోరాటాలు చేశామన్నారు. బందరు పోర్టు నిర్మాణం, 216 జాతీయ రహదారి ఏర్పాటుకు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నామన్నారు. బందరు పోర్టు ఏర్పాటుతో యువతకు లక్షలాది ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎపిఐఐసి, ఎంఎస్ఎంఇ తోడ్పాటుతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో ప్రధానంగా నీటి సమస్య ఉందని, 50 ఎకరాల్లో స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.150 కోట్ల వ్యయంతో గిడ్డంగి (వేర్ హౌసింగ్) నిర్మాణం చేపట్టనున్నామని, దీనిలో రోబో టెక్నాలజీతో కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు. మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు బందరు అభివద్ధిపై తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బందరు ఏ విధంగా రూపుదిద్దుకోనుందో తెలియజేసే విధంగా గ్రాఫిక్స్ దశ్యాలను, బందరు పోర్టు నిర్మాణ పురోగతి దశ్యాలను ప్రదర్శించారు. ఈ సమావేశంలో బందరు ఆర్‌డిఒ కె.స్వాతి, కూటమి నాయకులు బండి రామకష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపిపి కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

సివిల్ సప్లై అవుట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సప్లై కార్పొరేషన్ లో ఔట్సోర్సింగ్ టెంపరరీ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేసి వారందరినీ రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈరోజు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అవుట్సోర్సింగ్ అండ్ టెంపరరీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడ గొల్లపూడి లోని జోష్యభట్ల సత్యనారాయణ భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జి వేణు అధ్యక్షతన జరిగింది.

డిజెలకు అనుమతి లేదు : డిఎస్‌పి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఎవరు డిజేలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి లేదని డిఎస్‌పి టీ విద్యాశ్రీ తెలిపారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని జరుపుకునే సంఘాలవారు మైకులు పెట్టుకోవాలన్నా ర్యాలీలు నిర్వహించాలన్న జనసమూహాన్ని సమీకరించాలన్న ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారి పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. ఆ విధంగా పర్మిషన్ తీసుకోకుండా ర్యాలీలు మైకులు జన సమీకరణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పర్మిషన్ తీసుకున్నవారు నిర్వహించే కార్యక్రమాల్లో వాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే అందుకు ఆ సంఘాల వారి బాధ్యత వహించవలసి ఉంటుందని గుర్తు చేశారు. అందువల్ల పోలీసు వారికి సహకరించి శాంతి భద్రతలకు ఆటంకం కలక్కుండా సహకరించాలని డిఎస్పి కోరారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం : టిడిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలి గన్నవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు గన్నవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కుటుంబ సాధికార సారదుల నియామకాల పై ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు ఆరుమళ్ళ వెంకట కష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరిబాబు నాయుడు మాట్లాడుతూ ఉంగుటూరు మండలంలో కుటుంబ సాధికార సారధుల నియామకాలను త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. ప్రతి 60 ఓట్లకు ఇద్దరు కుటుంబ సాధికార సారధులను నియమించాలని తెలిపారు. రాష్ట్ర కమిటీ, పార్లమెంట్ కమిటీ, నియోజకవర్గ కమిటీ, గ్రామ కమిటీ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్‌లు ప్రతి ఒక్కరు పార్టీలో కె.ఎస్.ఎస్ లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, కొండేటి కొండలరావు, మాజీ జెడ్పిటిసి సుంకర విజయలక్ష్మి, గోగినేని విష్ణువర్ధన్ రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి- మోపిదేవి : గ్రామీణ ప్రజలకు చెవి ముక్కు గొంతు విభాగంలో వైద్య సహాయం అందించేందుకు దాతలు ముందుకు రావడం సంతోషకరమైన విషయమని పెదప్రోలు సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు పేర్కొన్నారు. మోపిదేవి మండల పరిధిలోని పెద్దప్రోలు గ్రామంలో ఆదివారం గిరిధర్ చెవి, ముక్కు, గొంతు హాస్పిటల్ లేజర్ సెంటర్ విజయవాడ ఆధ్వర్యంలో డాక్టర్ పివి మధుసూధన శర్మ, డాక్టర్ పి శ్వేత ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. పెదప్రోలు గ్రామంలో గోపాలకష్ణమూర్తి ఇంటి వద్ద నిర్వహించిన ఈ మెడికల్ క్యాంపు నందు ఎండోస్కోపీ పరీక్షలు , వినికిడి పరీక్షలు అత్యాధునిక పరికరాలతో సుమారు 100 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామపంచాయతీ సర్పంచ్ పొలిమెట్ల

ఏసుబాబు ప్రారంభించగా మండవ రాజేష్, కతి వింటి నాగరాజు, చంద్రా రామకష్ణ, యడ్ల శ్రీనివాసరావు తమ సహకారాన్ని అందజేశారు. గ్రామ పెద్దలు ప్రతి సంవత్సరం ఇటువంటి మెడికల్ క్యాంపును పెదప్రోలు గ్రామంలో నిర్వహించాలని డాక్టర్ మధుసూధన శర్మ గారిని కోరారు.

గోవుల మృతిపై తప్పుడు ప్రచారం తగదు : యలవర్తి

ప్రజాశక్తి - గుడివాడ : తిరుమల తిరుపతి దేవస్థానంలోని గోశాలలో గోవుల విషయంలో మాజీ టిటిడి ఛైర్మన్ వైసిపి నాయకుడు భూమన కరుణాకర్ తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని ఎన్‌టిఆర్ స్టేడియ కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబులు అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గోశాలలోని గోవులు అనారోగ్యాల వల్ల 1,2 చనిపోతే వాటి విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడడం

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యలవర్తి, దింట్యాల

సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన చూసి ఓర్వలేని తనంతో ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు చేకూరి జగన్‌మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నేర నియంత్రణ అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట కోసం వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు ఆర్ పేట సిఐ ఏసుబాబు తెలిపారు. మచిలీపట్నం డిఎస్పి సిహెచ్. రాజా ఆధ్వర్యంలో మచిలీపట్నం నగర పరిధిలోని చిలకలపూడి సీఐ, ఆర్‌పేట సిఐ, పెడన సిఐ, ఇతర సిబ్బంది శనివారం వాహనానలు తనికీ చేశారు. సమాజంలో జరుగుతున్న నేరాలను అదుపు చేయడం, అదేవిధంగా గంజాయి రవాణా అదుపు చేయ నిమిత్తం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని నిరోధించేందుకుగాను వాహనాలు తనిఖీ చేపట్టినట్లు సిఐలు తెలిపారు. ఈ వాహనాల తనిఖీలలో మందు తాగి వాహనం నడుపుతున్న ఆరుగురు ద్విచక్ర వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కోడూరు : నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను అంటూ తన స్నేహితుడుకు మెసేజ్ పెట్టి ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన కోడూరులో చోటు చేసుకుంది. కోడూరు ఎస్సై చాణిక్య తెలిపిన వివరాల మేరకు కోడూరు తూర్పు వైపుకు చెందిన గంధం సతీష్ (27) శనివారం రాత్రి ఒంటిగంట సమయంలో నేను ఉల్లిపాలెం వారధి పైనుంచి కృష్ణా నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా చెప్పులు, ద్విచక్ర వాహనం అక్కడ ఉంటాయి చూడండి అంటూ తన స్నేహితుడకు వినయ్ కి మెసేజ్ పంపినట్లు తెలిపారు. సతీష్ తండ్రి బ్రహ్మ రావు ఫిర్యాదు మేరకు కృష్ణా నదిలో యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టి యువకుడి మృతదేహన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతుడు అచ్చయ్య

ప్రజాశక్తి-కంకిపాడు : రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన కంకిపాడు మండలం దావులూరు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు మండలం తాడిగడప గ్రామానికి చెందిన బోయి అచ్చయ్య (46) సొంతగా టిప్పర్ లారీని కిరాయిలు తిప్పుకుంటూ కుటుంబాన్ని పోషించు కున్నాడు. ఈనెల 13వ తేదీన ఆదివారం తెల్లవారు జామున అచ్చయ్య జి. కొండూరు నుంచి తన టిప్పర్ లారీలో కంకర లోడ్ చేసుకుని పమిడిముక్కల మండలం మంటాడలో అన్లోడ్ చేయడానికి వెళుతూ మార్గమధ్యలో కంకిపాడు దగ్గరలోని దావులూరు టోల్గేట్ దాటిన అర్ధరాత్రి మూడు గంటల సమయంలో కాలకత్యాలు తీర్చుకునే నిమిత్తం లారీ ఆపారు.ఈ నేపథ్యంలో డివైడర్ మీద నిల్చొని ఉండగా విజయవాడ నుండి మచిలీపట్నం వైపు వస్తున్న కారు అచ్చయ్యను ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కంకిపాడు పోలీసులు తెలిపారు. మతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి శవ పరీక్ష నిమిత్తం తరలించారు.

పిడుగుపాటుకు చెట్టు దగ్ధం



ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గం కంకి పాడులో ఆదాఇవారం సాయంకాలం నాలుగు గంటల సమయంలో ఆరోగ్య మాత చర్చి ఎదురుగా ఉన్న చెట్టుపై పిడుగుపడింది. పిడుగుపాటుకు మంటలు వ్యాపించడంతో చెట్టుకొమ్మలు పూర్తిగా దగ్ధమైయ్యాయి.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలోని ఏలూరురోడ్డులో ఆదివారం పెను అగ్ని ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే గుడివాడ ఏలూరు రోడ్డులోని ఓ చేపల మేత గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ మీటర్ నుంచి వచ్చిన మంటలు గోడౌన్‌లో వ్యాపిస్తుండగా గమనించిన పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తమై, ఇరుగు పొరుగు ఇళ్లలో నుండి మోటర్ పైపులైన్ల ద్వారా మంటలు పెరగకుండా నియంత్రించారు. స్థానికుల అప్రమత్తతో స్వల్ప నష్టం మాత్రమే జరిగింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా నియంత్రించారు. ఈ ప్రమాదంలో గోడౌన్ సమీపంలోని ఓ ఇంటిలో రెండు ఏసిలు, ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. గోడౌన్ లోపలికి మంటలు వ్యాపించి ఉంటే, అక్కడ నిలువ ఉంచిన కెమికల్స్ ద్వారా పెను ప్రమాదం జరిగి ఉండేదని ఇరుగు పొరుగువారు ఆందోళన వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

ప్రజాశక్తి - గుడివాడ : క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే మానికొమ్మల(మట్టల) ఆదివారాన్ని స్థానిక ఏలూరురోడ్డు, కోతిబొమ్మ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డులోని మౌంట్ కార్మెల్ చర్చి, పామర్రు రోడ్డులోని చిన్న తేరేజమ్మ,(ఆర్‌సియం), సియస్‌ఐ దేవాలయంలలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్థానిక ఏలూరు రోడ్డులోని మౌంట్ కార్మిలమాత (ఆర్‌సిఎం-1)దేవాలయం ఆధ్వర్యంలో ఫాదర్ బియాంకి బాలికోన్నత పాఠశాల నుండి వర్ల బజార్, గుడ్‌మెన్ పేటలోని ఆర్‌సిఎం-2 బాపూజీ నగర్ నుండి దేవాలయం వరకు, సియస్ చర్చి ఆధ్వర్యంలో రైల్వేస్టేసన్ రోడ్డు నుండి నెహ్రుచౌక్ వరకు ఆర్‌సియం, సియస్‌ఐల ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు మట్టలను పట్టుకుని యూదులరాజుకు జయహో అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం గుడివాడ 1,2 విచారణకర్తలు ఫాదర్ గుజ్జుల మైఖేల్, ఫాదర్ మందపాటి లూయిస్, ఫాదర్ అందుగుల శ్రీకాంత్‌లు దివ్వ పూజా బలులను అర్పించారు. సియస్‌ఐ చర్చి పాస్టర్లు కమల సుధాకర్, అసిస్టెంట్ పాస్టర్ పాల్ సుంగధర్‌లు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : ఉయ్యూరు సుగాలీకాలనీలో బెతేల్ ప్రార్ధనా మందిరం పాస్టర్ విజయారాజ్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. సండేస్కూల్ విద్యార్ధులు ర్యాలీ నిర్వహించి యేసుమార్గం అనుసరణీయమని ప్రార్ధన చేస్తూ కాలనీలో తిరిగారు. సండేస్కూల్ టీచర్ కాగిత మీనాక్షి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. గండిగుంట, ఉయ్యూరు అంబేద్కర్ నగర్ మట్టల ఆదివారం నిర్వహించారు.

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) : బాపులపాడు మండలం వీరవల్లి కల్వరి వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో మట్టల అదివారాన్ని ఘనంగా నిర్వహించారు. సండే స్కూల్ పిల్లలు, విద్యార్థులు కలిసి ఏసుక్రీస్తును ఆరాధిస్తూ పాటలు ఆలపిస్తూ కొబ్బరి మట్టలు గ్రామంలో ర్యాలీ నిర్వహిం చారు. ఫాస్టర్ ప్రసన్నకుమార్, సంఘస్తులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : పమిడిముక్కల మండలం లోని మంటాడ, తాడంకి, లంకపల్లి, కష్ణాపురం మేడూరు తదితర గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు మట్టలను పట్టుకొని గ్రామాల్లో తిరిగారు. రెవరెండ్ పాస్టర్ పి రాజారత్నం, హెూసన్నా ప్రార్థన మందిరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మట్టల ఆదివారం సందర్భంగా పెదపూడి అంబేద్కర్ నగర్లో మోరియా గాస్పల్ హాల్ ప్రార్థన మందిరం పాస్టర్ జెట్టి జాన్ కన్వెన్షన్ ఆధ్వర్యంలో సండే స్కూలు విద్యార్థిని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం సండే స్కూల్ టీచర్ ఎం జ్యోతి పర్యవేక్షించారు.

గుడివాడలో...

ఉయ్యూరులో...

బాపులపాడు మండలంలో...

విచ్చలవిడిగా బెల్టు షాపులు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారులు వైన్ షాపు నిర్వాహలతో కుమ్మక్కై బెల్టు షాపులకు పూర్తిగా సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా వైన్ షాపుల్లో లూజ్ అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని దాదాపు 89 గ్రామాల్లో గ్రామానికి మూడు నుంచి 8 వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఇవేకాకుండా ప్రతి బడ్డీ కొట్లోనూ టిఫన్ సెంటర్ వద్ద సైతం మద్యం మంచినీళ్ల కంటే దారుణంగా సరఫరా చేస్తున్న నియోజకవర్గంలోని చోద్యం చూస్తున్నారు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపుల వద్ద వారం వారం మామూలు వసూలు చేసుకోవడానికి ఎక్సైజ్ సిబ్బంది ఆ షాపులు వద్ద తిరుగుతూ ఉండటం పలువురు మందుబాబులు సైతం వారిని విచిత్రంగా చూస్తున్నారు. సాక్షాత్తు నందిగామ పట్టణంలోని భారత టాకీస్ సెంటర్ వద్ద మూడు వైన్ షాపులకు సమాంతరంగా సాయంత్రం 10:30 నుంచి తెల్లవారుజామున 10:30 వరకు రెండు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. వీటికి అక్కడే ఉన్న లైసెన్స్ వైన్ షాపుల నుండి ముందు సప్లయ్ చేయడం గమనార్హం. ఇంత జరుగుతున్న తామ రాజకీయాలకు లొంగిపోవాల్సి వస్తుందని, ఏమి చేయలేకపోతున్నామని ఎక్సైజ్ శాఖ అధికారులు వాపోతుండటం గమనార్హం. ఇలా ఉంటే వైన్ షాపుల్లో లూజు అమ్మకాలు జరుగుతున్నప్పటికీ వీటిపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లు తమకు ఎవరూ ఫిర్యాదు చేసినట్లు కనిపిస్తున్న పట్టించుకోకుండా దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. నందిగామ నియోజకవర్గంలోని వైన్ షాపులు వాటి అనుబంధంగా బెల్ట్ షాపులు వ్యవహారంలో ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో షాపు నిర్వాహకులపై నియోజకవర్గ ఎక్సైజ్ అధికారులపై రాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు కొంతమంది సామాజిక కార్యకర్తలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

ఈదురుగాలులకు పడిపోయిన హోర్డింగ్

తిరువూరులో వర్షం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరులో ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అం తరాయం ఏర్పడటంతో తిరువూరు పట్టణంతో పాటు గ్రామాల్లో అంధకారం ఏర్పడింది. జన జీవనం స్తంభించింది. ఇంటి పైకప్పులు గాలికి కొట్టుకుపోయాయి. ఉదయం నుండి సూర్య భగవానుడు భగభగలకు అల్లాడిన ప్రజలకు ఉపశమనం కలిగినప్పటికీ రైతన్నలు కుదేలయ్యారు. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన దాళ్వా ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ధాన్యంపై పట్టాలు కప్పినప్పటికీ గాలి ఉధృతికి కొట్టుకు పోయినట్లు రైతులు అవేదన వ్యక్తం చేశారు.

మునేటి బ్రిడ్జిపై మట్టి తొలగింపు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణ శివారు మధిర రోడ్డు పెద్ద బ్రిడ్జిపై గత కొంతకాలంగా పేరుకుపోయిన మట్టిని నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఆదివారం దగ్గరుండి బ్రిడ్జి మొత్తం శుభ్రం చేయించారు. ఆదివారం కూడా విశ్రాంతి తీసుకోకుండా మున్సిపల్ కమిషనర్ రమణబాబు పని చేస్తుండటం పట్ల నందిగామ పట్టణ ప్రజలు, మునేటి ఏటి పట్టు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీలోని బి కాలనీ వద్ద గజరాజు చెరువు పక్కన శ్రీ సాయిబాబా ఆలయ ప్రతిష్ట మహోత్సవాల్లో మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదు ఆదివారం పాల్గొన్నారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహనరావు గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు జంపాల సీతారామయ్య, చుట్టుకుదురు వాసు, స్థానిక నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విస్సన్నపేట: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు మాట్లాడుతూ దేశ ప్రజలకు అందరికీ అన్ని విధాల ఉపయోగపడే విధంగా ఎంతో శ్రమించి భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాశారని, దీనిని సవరించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. ప్రజలు దీనిని గమనించి బిఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలను రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, పెరబత్తల వెంకటేశ్వరరావు, గద్దల రామకృష్ణ, గద్దల లాలయ్య, కంచర్ల గురవయ్య, కోలేటి రాజ్ కుమార్, పేరాబత్తుల బాజీ కాంతారావు, పింగుల తంబి, కోపూరు ప్రకాష్ రావు, నిమ్మకూరు నాని, పేరాబత్తుల సురేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-తిరువూరు: విద్యార్థులలో దాగిఉన్న సజనాత్మక శక్తిని వెలికి తీయడానికి జనవిజ్ఞానవేదిక ప్రతి ఏటా ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం అభినంద నీయమని మండల విద్యాశాఖాధికారి ఏ.శ్యాం సుందరరావు అన్నారు. తిరువూరు మండల విద్యా శాఖ కార్యాలయంలో జెవివి రూపొందిం చిన వేసవి శిక్షణ శిబిర కర పత్రాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. స్పోకెన్ ఇంగ్లీష్, జనరల్ సైన్స్, మ్యాథ్స్, మేజిక్ షోలలో శిక్షణ ఇస్తామని, ఏప్రిల్ 28నుండి తిరువూరులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శిక్షణ శిబిరం ప్రారంభం అవుతుందని జెవివి మండల అధ్యక్షులు ఎం. సుధాకర్ తెలిపారు. ఆవిష్క రణ కార్యక్రమంలో జెవివి ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్, ఉపాధ్యక్షులు ఎం.హరికృష్ణ, నాయకులు ఎం. రాం ప్రదీప్, బి. సైదులు, ఎస్ డి. సుభానీ, ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లుకు ధాన్యం తరలింపు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని మార్కెట్ యార్డులో రైతుల ఆవేదనతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనితో జగ్గయ్యపేట మండల తహశీల్దార్ పి మనోహర్ రంగంలోకి దిగి రైతుల సమస్యలను తెలుసుకొని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీనితో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ మార్కెట్ యార్డులో వచ్చిన రబీ ధాన్యాన్నికి ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర 75 కేజీల బస్తాకు 1740 రూపాయలు ధర చొప్పున చెల్లించే విధంగా స్థానిక అనుమతులు పొందిన మిల్లర్లతో మాట్లాడి దగ్గరుండి లోడును ఎత్తించడం జరిగింది. దీనితో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడియస్ అధికారి రాహుల్, సొసైటి అధికారి రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న సిబ్బంది

మహిళకు గ్రైండర్ పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ: లైన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ. ఆధ్వర్యంలో మహిళకు గ్రైండర్‌ను లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు ఆదివారం పంపిణీ చేశారు. ఇద్దరుకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మందడపు సీతారామయ్య, కార్యదర్శి లక్ష్మీకాంత్, యర్రంరెడ్డి గాంధీ, విజయలక్ష్మి, తుర్లకొండ సీతారామయ్య, రామిరెడ్డి శ్రీధర్, గోపు నరేంద్ర, నుకవరపు సాంబశివరావు, పులి రజనీకాంత్. గోపు సుబ్రహ్మణ్యం. చల్లగాంది. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-నందిగామ: 2025-26 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి కష్ణాజిల్లాలో గల నిరుపేద ఎస్సీ కులమునకు చెందిన అభ్యర్థులు జీవనోపాధికై వివిధ స్వయం ఉపాధి పథకాలు (బ్యాంకు లింక్డ్) రుణాలు పొందుటకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కష్ణాజిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ డికె.బాలాజీ సూచించారు. అభ్యర్థులు 21 సం సంవత్సరములు నుండి 50 సంవత్సరాలు మించి ఉండరాదన్నారు. ఈ నెల 14 తేదీ నుండి మే 10 తేదీ లోపు ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆంగ్ల అక్షరాలతో అంబేద్కర్ చిత్రం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తిరుమలగిరి నందు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న తుములూరి ప్రసాద్‌బాబు అంబేద్కర్ ఆశయాలు, ఆయన గొప్పతనం విద్యార్థులకు తెలియచేయాలని మరియు విద్యార్థుల్లో సజనాత్మక శక్తిని పెంపొందించాలని రాజ్యాంగం గురించి అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి విద్యార్థుల స్ఫూర్తి నింపేందుకు ఇంగ్లీష్ అక్షరాలతో అంబేద్కర్ గారి చిత్రపటాన్ని గీశారు. పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు, మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టి బాబు అంబేద్కర్ చిత్రపటాన్ని గీసినందుకు అభినందించారు. ప్రతి విద్యార్థి కూడా అంబేద్కర్ అంత గొప్పవాడు కావాలని సమాజంలో ప్రతి ఒక్కళ్లు కులమత బేధాలకతీతంగా జీవించాలని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని చిట్టిబాబు ఈ సందర్భంగా తెలిపారు.



ముగిసిన సత్యమ్మ తల్లి తిరునాళ్ల

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ మండలం అంబారుపేటలో సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కష్ణప్రసాదు , ఆయన సతీమణి వసంత శిరీష ఆదివారం పాల్గొన్నారు. గత ఐదు రోజుల నుంచి నిర్వహించిన సత్యమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు సతీసమేతంగా ప్రారంభించారు. ముందుగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు, వసంత శిరీష కు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అంబారుపేట గ్రామంలో సత్యమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం చివరి రోజు ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, ఎన్టీఆర్ జిల్లా నాయకులు యర్రబడి సురేష్, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మాధవరావు పాల్గొన్నారు. తిరుణాల మహోత్సవంలో చివరి రోజు యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి పురపాలకలోని పుట్లమ్మ గట్టులో కంకర కొట్టుకుని జీవించే నిరుపేద పనికల్ ప్రకాష్ కొంతకాలంగా దీర్ఘకాల వ్యాధితో తీవ్ర ఇబ్బంది పడుతూ నెల రోజులుగా ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్యం తీసుకుంటున్నారు. బాధితుని ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి రూ.15 వేలు ఆర్థిక సహాయం చేశారు.

నేడు 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈనెల 14వ తేదీ సోమవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు అయినందున ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా ప్రజలు ఈ విషయం గమనించాలని కలెక్టర్ కోరారు.

వాకర్స్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఉయ్యూరు : సమాజంలో ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయమని వాకర్స్ అసోసియేషన్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు కొనియాడారు. ఉయ్యూరు వాకర్స్ అసోసి యేషన్, మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఏజిఅండ్స్ ఎస్ కళాశాల ఆవరణలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించి 200 మందికి గుండె. నేత్ర, సంబందిత, బీపీ, షుగ ర్, మహిళలకు కేన్సర్ సంబందిత వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లాగవర్నర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిని ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ తక్కువ కాలంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. సభ్యుల సహాకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహిస్తా మని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోడె సాంబశివరావు, చంటిబాబు ప్రకటించారు. వైద్య విభాగ చైర్పర్సన్ సంగం తిరుమలరావు, అసోసియేషన్ జిల్లా నాయకులు నెల్లి రాంబాబు, పొగిరి రాము, వినయ్కుమార్, శ్రీనివాసరావు, కిషోర్కుమార్, బాలాప్రసాద్ తదితరులు పాల్గొని సేవలందించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు : జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చదువుల్లో రాణించడం ఎంతో ముఖ్యమని చిన్న వయస్సులోనే చదువు ప్రాధాన్యతను గుర్తించి, అత్యున్నత స్థాయిలో మార్కులు సాధించడం అభినందనీయమని కంకిపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. తాజాగా విడుదలైన ఇంటర్ ఫలితాల్లో కంకిపాడుకు చెందిన అన్నాచెల్లెలు, జవ్వాది రంజిత్ కుమార్ 92 శాతం, జవ్వాది రమ్య రిషిత.97శావతం, గంగూరు కు చెందిన కన్నెకంటి చరణ్ తేజ.97.2 శాతం లు అత్యధిక శాతం మార్కులు సాధించినందుకు చిన్నారులను అభినందించి, నగదు ప్రోత్సాహం అందజేశారు.

డివైడర్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవతో డివైడర్ సమస్య పరిష్కారం అయ్యింది. ప్రసాదంపాడు గ్రామంలోని రవీంద్ర భారతి స్కూల్ దగ్గర ఉన్న డివైడర్ కటింగ్ ను అధికారులు ఆకస్మికంగా మూసివేశారు. డివైడర్ మూసివేయటం వల్ల ఈ దారిలో వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండటంతో టీడీపీ నాయకులు గూడవల్లి నరసింహారావు, బొప్పన హరికష్ణలు సమస్య ను ఎమ్మెల్యే యార్లగడ్డ దష్టికి తీసుకువెళ్లి దీన్ని తిరిగి తెరిపించాలని, వాహన చోదకుల ఇబ్బందులను ఎమ్మెల్యే కు వివరించారు. సమస్య పై సానుకూలంగా స్పందించిన అయన సంబంధిత అధికారులతో మాట్లాడి 24 గంటల్లోపు తిరిగి డివైడర్ కటింగ్ ను తెరిపించారు. ప్రయాణికుల సమస్యలపై సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ కు ప్రసాదంపాడు గ్రామ ప్రజలు తరఫున గూడవల్లి నరసింహారావు, బొప్పన హరికష్ణ తదితరులు కృతజ్ఞతలు తెలియచేసారు.

శ్రీలంకమ్మ జాతరకు పోటెత్తిన యాత్రికులు

ఆలయంలో భక్తులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో వేంచేసియున్న శ్రీలంకమ్మ అమ్మవారి జాతర రెండో రోజు ఆదివారం కూడా కొనసాగింది. శనివారం జాతర రావడంతో ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకోలేనివారు ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకోవడంతోపాటు అమ్మ వారికి నైవేద్యాలు ఘటం బిందెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ లు ప్రత్యేక బంధబస్తు నిర్వహించారు.

ఘనంగా 'వేదిక్ శ్రీమేధా' వార్షికోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-మొవ్వ : వేదిక్ శ్రీమేధా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం కూచిపూడి లో ఎస్ఎస్ఎల్ కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు మాట్లాడుతూ విద్యార్థులను మానసిక ఒత్తిడి గురి చేయవద్దని, విద్యా విషయంలో వాళ్ళని మానసిక ఒత్తిడి గురి చేయకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులదే అనిపేర్కొన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించి వారు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థి విద్యార్థులు బాగా చదువుకునేలా, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా, మంచిగా చదువుకోవాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి ఎస్సై కె విశ్వనాథ్, వేదిక్ శ్రీ మేధ పాఠశాల చైర్మన్ సీనియర్ న్యాయవాది ఏలేశ్వరపు శివ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ ఏలేశ్వరపు రాధిక సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ వెంపటి బాపిరాజు, నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాదే శ్యాం, రామచంద్రపురం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటనారాయణలు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మ్యూజికల్ డాన్స్ షోలు, అలరింపజేశాయి.

వైభవంగా 'వాణీ విద్యానికేతన్' స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) : బాపులపాడు మండలం వీరవల్లి వాణీ విద్యా నికేతన్ స్కూల్ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ఏఎస్ ఆర్ ప్రసాద్ , కరస్పాండెంట్ నందిగం రవి కుమార్, గ్రామ ప్రముఖులు గుండ పనేని ఉమా వరప్రసాద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరస్పాండెంట్ రామా సులోచన వార్షిక నివేదిక సమర్పించారు. వివిధ అంశాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ఏ ఎస్ ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి దోహదపడేలా వాణి విద్యా నికేతన్ స్కూల్ కషి చేస్తోందని చెప్పారు. కరస్పాండెంట్ నందిగం రవి కుమార్ మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ,ఆత్మ స్థైర్యాన్ని , పెంపొందించే విధముగా విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు.పిల్లలు నేర్చుకునే విషయాలు సమాజానికి ఉపయోగపడేలా ఉంటాయన్నారు. ఈకార్యమంలో ఎంపిటిసి సూర్యనారాయణ కోడేబోయిన బాబీ, ఉపాధ్యాయులు , విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఇంటర్ ఫలితాలలో ఎస్సి వసతి గృహ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో నడుస్తున్న కళాశాలల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరమునకు సంబంధించి శనివారం విడుదల చేసిన ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు జిల్లా ఎస్సి. సంక్షేమం, సాధికారిత అధికారి,షాహిద్ బాబు షేక్ తెలిపారు. మొత్తం ఏడు కళాశాలల్లో 79 మంది విద్యార్థిని /విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా 73 మంది విద్యార్థిని /విద్యార్థులు ఉత్తీర్ణత (93 శాతం) సాదించారన్నారు.అలాగే మూడు కళాశాల వసతి గహములోని విద్యార్థిని /విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారన్నారు. .ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో ఎం పి సి గ్రూప్ విద్యార్థిని ఎన్.శ్యామల 1000/968, ఎం పి హెచ్ డబ్ల్యూ, గ్రూపు విద్యార్థిని కె.రమ్య 1000/964, బై పి సీ గ్రూప్ విద్యార్థిని కె.మేఘన సంధ్య 1000/954 అత్యధిక మార్కులు సాధించారన్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాలలో వత్తి విద్య కోర్స్ అభ్యసిస్తున్న విద్యార్థినీలు డి.వర్ష 500/480, వి.చంద్రిక 500/480 సి హెచ్ అనుష్క లు 500/478 అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : చిన్న వయసులో ఆడి పాడి అందరూ కలిసి చదువుకున్న పాఠశాలకు 15 ఏళ్ల తర్వాత వెళ్లి ఆత్మీయ కలయికతో ఆనందించారు. మచిలీపట్నం జార్జ్ కారనేషన్ హైస్కూల్ లో 2009 -2010 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వారంతా ఒకచోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకు న్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి అందరికీ పరిచయం చేసుకున్నారు. వివిధ హెూదాలో పూర్వ విద్యార్థుల ఉన్నారని ఇంకా మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. విద్యార్థులకు చదువు చెప్పిన అప్పటి గురువులను శాలువాలు పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆదివారం సంధర్భంగా సుమారు 20 వేల మందికి పైగా యాత్రికులు దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. వేసవికాలం కారణంగా యాత్రికులకు దేవస్థానం వారు మజ్జిగ పంపిణీ చేశారు. దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు త్రాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించినారు. అలాగే ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

విజయవాడలో '23' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విజయవాడ నగరంలో 23 చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్రం ప్రమోషన్ లో భాగంగా ఏలూరు రోడ్డు గుణదల లోని రామ్స్ థియేటర్లో 23 చిత్రం ప్రీమియర్ షో ఆదివారం ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో తేజ మాట్లాడుతూ తేజ మాట్లాడుతూ సంచలన విజయం సాధించిన మల్లేశం చిత్ర దర్శకుడు రాజ్ రాచకొండ దర్శకత్వంలో 23 చిత్రంలో తాను హీరోగా నటించినట్లు తెలిపారు. 1990వ దశకంలో చిలకలూరిపేటలో జరిగిన ఒక బస్సు అగ్ని ప్రమాద ఘటనను ఇది వత్తముగా తీసుకొని దర్శకుడు 23 చిత్రాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ఈ చిత్రంలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని తెలియజేశారు. దర్శకుడు చెప్పిన కథ విన్న వెంటనే నచ్చి ఈ చిత్రంలో హీరోగా నటించడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు.. ప్రతి సన్నివేశం నిజ జీవితానికి దగ్గరగా ఉంటుందని, గ్రామీణ నేపథ్యంలో తీసిన సన్నివేశాలు ఆలోచింపచేసే విధంగా ఉంటాయని చెప్పారు. కోర్టులో జరిగే సన్నివేశాలు వాదోపవాదనలు, జడ్జిమెంట్ లాంటి సన్నివేశాలు అందరిని అలరిస్తాయని వివరించారు.

మాట్లాడుతున్న కథా నాయకుడు తేజ

అనంతరం చిత్ర దర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ 23 చిత్రానికి పేరు పెట్టడానికి ప్రధాన కారణం బస్సు ప్రమాద ఘటనలో సుమారు 20 నుంచి 20 ఏళ్లలోపు మధ్య యువకులే మరణించారని అందుకే ఈ చిత్రానికి 23 అనే పేరు పెట్టడం జరిగిందన్నారు. చిలకలూరిపేట సత్తెనపల్లి హైదరాబాద్ ప్రాంతాల్లో చిత్ర నిర్మాణం చేశామని తెలిపారు. ప్రమాద ఘటనలో బాధితులకు న్యాయం జరిగిందా శిక్ష పడిందా అనే సన్నివేశాలను ప్రేక్షకులకు కళ్ళకు కట్టే విధంగా తీసేమని చెప్పారు. సమాజంలో చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా అనే టాగ్లైన్ తో సినిమా నిర్మించామని ఈ చిత్రం ప్రేక్షకులను ఆలోచింపజేసే విధంగా ఉంటుందని తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో చట్టం న్యాయం అనేది కొంతమందికే పరిమితమైందని చాలామంది సామాన్యులకు చట్టం సమానంగా అందడం లేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులు ఓటీటీ లకు పరిమితమవుతున్నారని 23 చిత్రంను ప్రతి ప్రేక్షకుడు థియేటర్లోనే వీక్షించాలని ఆయన కోరారు. ఈ మధ్యకాలంలో వచ్చిన కోర్టు అనే చిన్న సినిమా ఎంత ఘనవిజయం సాధించిందో ప్రేక్షకులందరికీ తెలుసని తమ చిత్రంలో కూడా వచ్చే కోర్టు సన్నివేశాలు ప్రేక్షకులకు ఉత్కంఠ కలిగిస్తాయని వివరించారు. త్వరలో థియేటర్లలోకి తమ చిత్రం రానున్నదని చిన్నచిత్రం అని చూడకుండా ప్రేక్షకులు తప్పక వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. తదనంతరం హీరోయిన్ తన్మయ మాట్లాడుతూ తెలుగులో తాను 23 అనే చిత్రంతో వెండి తరపు పరిచయం అవుతున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో క్యారెక్టర్ ప్రేక్షకులకు ఎంతగానో నచ్చుతుందని తెలియజేశారు. దర్శకుడు ప్రేమ సన్నివేశాలు కోర్టు సన్నివేశాలు చాలా చక్కగా చిత్రీకరించారని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని తప్పక వీక్షించాలని ఆమె కోరారు.

రక్షిత

ధనుష్

శివ మల్లిక

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన గొల్లపూడి ఎస్ ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని విజయవాడ జోనల్ ఇంచార్జి కష్ణారావు ఒక ప్రకటనలో తెలియజేశారు.ఇంటర్ ఎమ్‌పిసి మొదటి సంవత్సరం విద్యార్థులైన ఎమ్ సాయి తనుష్ మరియు ఆర్.సీత శివ మల్లికా 470 మార్కులకు 466 మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసి విద్యార్థిని జి రక్షిత, లియోనా 440 మార్కులకు 431 మార్కులు, ఇంటర్ రెండవ సంవత్సరం ఎమ్‌పిసి విద్యార్థి బి కోమలి వెయ్యి మార్కులకు 987 మార్కులు, ఇంటర్ రెండవ సంవత్సరం బైపిసి విద్యార్థిని జి తేజస్వీని 977 మార్కులు సాధించారని తెలిపారు. ఈ విజయంలో పాలుపంచుకున్న విద్యార్థులకు, సిబ్బందికి ఎపి అకాడమిక్ డీన్ అరవింద్, విజయవాడ అకాడమిక్ డీన్ శంకరరావు అభినందలు తెలిపారు.

మధు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ వన్ టౌన్ ప్రాంతంలో హోమియో వైద్యులు డాక్టర్ వి.మధు ప్రజలకు, సిపిఎంకు చేసిన సేవలు ప్రశంసనీయమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పాతబస్తీ కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్ లో సిపిఎం ఆధ్వర్యంలో డాక్టర్ వి.మధు సంస్మరణ సభను నియర్ నాయకులు పిల్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, నగర పశ్చిమ కార్యదర్శి బోయి సత్య బాబు మాట్లాడుతూ డాక్టర్ మధు యుక్త వయసు నుంచి హోమియో వైద్యంలో మక్కువ పెంచుకొని ప్రజలకు సేవలు అందించారన్నారు. సిపిఎం సిద్ధాంతాలకు ఆకర్షితులై ప్రజానాట్యమండలి సభ్యులుగా చేరి పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారని అన్నారు. అప్పటి నుండి తుది శ్వాస వరకు సిపిఎం బలోపేతానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గాదే ఆదిలక్ష్మి, సంపర రాంబాబు, నాయకులు సూరిబాబు, ప్రజానాట్యమండలి నాయకులు అప్పన్న, కుటుంబ సభ్యులు విప్లవ కుమార్ పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వానికి పట్టవా?

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు నిత్యకత్యమయ్యాయని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. సాగువేళ తుఫానులు, వరదలు, వర్షాభావ పరిస్థితులు.. ఇలా ఒకదాని తర్వాత ఒకటిగా వైపరీత్యాలు ముప్పేట దాడి చేయటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అన్నదాతల పాలిట మత్యుపాశాలుగా మారాయని అభిప్రాయపడ్డారు. చందర్లపాడులో కౌలు రైతు బత్తుల వీరబాబు ఆత్మహత్య చేసుకోవటం బాధాకమని మల్లాది విష్ణు అన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే పది నెలల కూటమి పాలనలో ఆత్మహత్యలకు పాల్పడిన వారి సంఖ్య వంద దాటిందంటే రైతులు ఎంతటి దయనీయ స్థితిలో ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఇక అనధికారికంగా చూసుకుంటే వీరి సంఖ్య 200 కి పైనే ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకున్న వారిలో రాయలసీమ జిల్లాలకు చెందిన వారే అత్యధికంగా ఉన్నారన్నారు. అయినా ఒక్కరంటే ఒక్కరికి కూడా ఈ ప్రభుత్వం పరిహారం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. దీంతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల దయనీయ పరిస్థితి కంట తడి పెట్టిస్తోందన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో సాగుచేసి పండించిన కొద్దిపాటి పంట చేతికొచ్చే సమయంలో ధర లేక అయినకాడికి తెగనమ్ముకుంటూ.. మిర్చి, ప్రత్తి, వరి, మొక్కజొన్న రైతులు తమ కష్టాన్ని దళారుల పాలు చేస్తున్న దయనీయ పరిస్థితి ఏర్పడిందన్నారు.

క్రాంతి హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మరియు కవులూరు క్రాంతి హైస్కూల్లో కిండర్ గార్డెన్ విద్యార్థినీ విద్యార్థులకు కాన్వకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వెనిగళ్ళ మురళీ మోహన్ చేతుల మీదుగా కోర్స్ కంప్లీట్ సర్టిఫికెట్స్ ప్రదానం చేయడం జరిగినది. అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు చక్కటి సాంస్కతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెనిగళ్ళ అమ్మాజీ పాఠశాల నివేదిక ను తల్లిదండ్రులకు వివరించారు. కేవలం చదువులో మాత్రమే కాకుండా అన్ని రంగాల్లో ముందుండేలా విద్యార్థులకు సంపూర్ణ విద్యను అందించడానికి చేస్తున్న కషిని వివరించారు. కేవలం పాఠశాలలో మాత్రమే పోటీలను నిర్వహించడం కాకుండా మండల స్థాయి, జిల్లా స్థాయి పోటీలలో కూడా పాల్గొని విజయాలు సాధించే విధంగా తర్ఫీదు ను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో సాధించిన విజయాలను తెలియచేశారు. ఇలా పోటీలలో పాల్గొనేలా చెయ్యడం వలన పోటీ ప్రపంచం తెలుస్తుంది. ఈ సంవత్సరంలో రెండు పాఠశాలలు క్రాంతి హై స్కూల్ రెండు బ్రాంచ్ లు డివిజన్ పరిధిలోను మరియు జిల్లా పరిధిలో జరిగిన స్పోర్ట్స్ మీట్ లలో రెండు ఛాంపియన్షిప్ ను అనగా విన్నర్స్ మరియు రన్నర్స్ ఛాంపియన్ షిప్స్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో క్రాంతి విద్యార్థులు ఎక్కడ ఏ పోటీలకు వెళ్లినా అవార్డులతోనే తిరిగి వచ్చారని తెలిపారు. ఈ విజయాలకు సహకరించిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అకడమిక్ సబ్జెక్ట్స్ తో పాటుగా ఇతర యాక్టివిటీస్ ను కూడా అనుసంధానం చేస్తూ విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు.

ఆది దంపతుల నదీ విహారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: చైత్ర మాస కళ్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు కృష్ణానదిలో నదీ విహారం నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిధ్యాలు నడుమ స్వామి, అమ్మ వార్లకు నదీ విహారము నిర్వహించటకు మల్లేశ్వర స్వామి ఆలయం నుండి బయలుదేరిన బందం మహామండపం వద్దనుండి కూచిపూడి నృత్య కళాకారులు, తప్పెట్లు, కోలాటం, భజన సంకీర్తనలతో కోలాహలంగా దుర్గా స్నానఘాట్ చేరింది. పుష్పాలంకరణ చేసిన ఫంటుపై స్వామి, అమ్మవార్లను అధిరోహింపజేసిన అనంతరం కష్టానదిలో నదీవిహారం ప్రారంభం అయింది. కళ్యానోత్సవ ఆది దంపతులను కష్టా నదిలో విహరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య .శివ ప్రసాద్ శర్మ, దేవస్థానం కార్యనిర్వాహక ఇంజనీర్ జె సి. వైకుంఠరావు,దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి శ్రీ కొచ్చెర్ల గంగాధర్,ఆలయ పర్యవేక్షకులు నరసింహరాజు, చందు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల మట్టల ఆదివారం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో మట్టలాదివారపు ఊరేగింపు, ఆరాధనలు ఘనంగా జరుపుకున్నారు. పూలతో అలంకరించిన ఈతమట్టలు, ఖర్జూరపు మట్టలను చేతబూని క్రీస్తు యెరూషలేము ప్రవేశం ను గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు జరుపుకునే ఈ వేడుకలు చూపరులను ఆకట్టుకున్నాయి. **గంపలగూడెం:** మండల వ్యాప్తంగా అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి, యేసు క్రీస్తు యొక్క సాత్వికతను వివరించారు. ఎంతటి సమస్యలు ఎదురైన పగ తీర్చుకొనుట కాదని నెమ్మది కలిగి ప్రదర్శించడమే సాత్వికతగా వివరించారు. ముందుగా, క్రైస్తవులు అంత ఈతమట్టలకు పూలను ఏర్పాటు చేసి, పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అమ్మి రెడ్డిగూడెం, గంపలగూడెం తెలుగు బాప్టిస్ట్, ఊటుకూరు, పెనుగొలను తదితర అన్ని చర్చిల్లో ఈ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. **విస్సన్నపేట:** విసన్నపేట మండలం స్థానిక ఎల్ ఏ ఎఫ్ చర్చ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఎంతో నిబద్ధతతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే మ్రానుకొమ్మల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఎఎఫ్ చర్చ్ పాస్టర్ పరస భూషణం ఆధ్వర్యంలో సంఘస్తులతో కలిసి మ్రానుకొమ్మలను తీసుకొని ప్రతిశ్రద్ధలతో కీర్తనలు పాడుతూ ప్రభువును ఘనపరుస్తూ ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా మండలంలో పలు గ్రామాల్లో మ్రాను కొమ్మల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోలేటి ఎర్రబాబు, సునీల్, రమేష్, ఆదాం పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరులో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాజుపేట సిఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఈఊరేగింపులో సంఘ పెద్దలు విలియం, రవి, యేసుపాదం, తిరువూరు డీనరీ చైర్మన్ డి.దైవకపావరం, నియోజకవర్గ క్రిస్టియ న్ కౌన్సిల్ అద్యక్షుడు గంటా జయంత్ బాబు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మాని కొమ్మల ఆదివారం సందర్భంగా పట్టణంలోని ఆర్.సి.యం చర్చిలో సంఘస్తులందరూ సుమారుగా 500 మంది జగ్గయ్యపేట పురవీధులలో మాణిక్రమలతో దావీదు కుమారునికి జై అంటూ నినాదాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దివ్య బలి పూజ రెవరెండ్ ఫాదర్ కొరివి తోమస్ సమర్పించినారు. వారికి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిసె జయరాజు కమిటీ సభ్యులు సన్మానించారు. షేర్ మహమ్మద్ పేట గ్రామంలో సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం సందర్భంగా గ్రామ పురవీధులలో మట్టలను చేత పట్టుకొని గ్రామంలో వీధులలో తిరిగారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కూచిపూడి సుధాకర్, బాబురావు, ప్రభాకర్, కూచిపూడి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెంలో...

రెడ్డిగూడెంలో...

విస్సన్నపేటలో...

కొడాలి నాని ఆరోగ్యంగా ఉండాలని పూజలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : బైపాస్ సర్జరీ చేయించుకున్న మాజీ మంత్రి కొడాలి నాని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని కాంక్షిస్తూ వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆయన అభిమానులు, ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడ్లవల్లేరు మండలం కుచికాయలపూడి గ్రామం నుండి కొండలమ్మ దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టిన అభిమానులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశి భూషణ్, కుచికాయలపూడి ఎంపీటీసీ కొడాలి శివ, గుడ్లవల్లేరు ఎంపీపీ కొడాలి సురేష్, పెన్నేరు ప్రభాకర్, కోటప్రోలు నాగు ,కొంకితల ఆంజనేయ ప్రసాద్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

19న వాక్ ఫర్ జీసస్

ప్రజాశక్తి - మంగళగిరి : క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి టౌన్ లూథరన్ చర్చి నందు వాక్ ఫర్ జీసస్ కార్యక్రమమునకు సంబంధించి కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 19 వ తేదీ ఉదయం 6 గంటలకు లకు మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి వాక్ ఫర్ జీసస్ ప్రేయర్ ర్యాలీప్రారంభం అవుతుందని తెలియజేశారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా మంగళగిరి పార్క్ రోడ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలను పగిడి ప్రభుదాసు ప్రారంభించి మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆయన యొక్క జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి అన్నారు. ఈ పోటీల్లో నాలుగు టీములు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో పార్క్ రోడ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేస్తారు.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మైనారిటీ చైర్మన్‌ను కలిసిన షేక్ సలీం

ప్రజాశక్తి - మంగళగిరి : విజయవాడలో ఆదివారం సిద్ధార్థ కాలేజ్ ఆడిటోరియంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా శంఖారావం జరిగింది. ఏఐసీసీ మైనారిటీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ ఘడి ని మర్యాదపూర్వకంగా మంగళగిరి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి షేక్ సలీం కలిశారు.ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న మైనారిటీ లలో ఇటీవల ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బిల్ తో తీవ్ర అలజడి సృష్టించిందని దుయ్యబట్టారు. ఈ బిల్ లో అనేక అవకతవకలు ఉన్నాయని ఈ బిల్ ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎంపీగా ఉన్న ప్రస్తుత ఏఐసీసీ మైనారిటీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ను తనవంతు కృషిచేసే ఈ బిల్ రద్దుకు తోడ్పాటు అందించాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

ప్రజాశక్తి-అవనిగడ్డ : పెన్షనర్లకి చేయూత నందించడం సంతోషినిచ్చిందని ప్రముఖ పారిశ్రామికవేత్త కూటమి నాయకులు, వికతి వీర రాఘవయ్య ఫౌండేషన్ చైర్మన్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. అవనిగడ్డ మూడో వార్డులోని దివి యూనిట్ పెన్షనర్స్ అసోసియేషన్ భవనానికి రూ 80, వేలు పైగా వెచ్చించి ఫ్లోరింగ్ పనులు చేయించారు. భవనం ఫ్లోరింగ్ పనులు పూర్తయిన నేపథ్యంలో ఎన్జీవోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బొప్పన వెంకట చిన సుబ్బా రావుతో కలిసి భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు విశ్రాంతి కోసం ఏర్పాటు చేసుకున్న కార్యాలయానికి తన వంతు సాయం అందించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎన్జీవోస్ మాజీ అధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగుల యూనియన్లలో ఉన్న విభేదాల కారణంగా ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేకపోతున్నట్లు తెలిపారు. ఉద్యోగులంతా సమైక్యంగా పోరాడితేనే ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు పొందగలుగుతామన్నారు. ఈ సందర్భంగా విశ్రాంతిభవనం నిర్మాణానికి అడిగిన వెంటనే సాయం అందించిన దాత శ్రీనివాసరావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం రామకష్ణ, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, కాశీభట్ల నాగేశ్వరరావు, ఆర్ నాగేశ్వరరావు, రాధాకష్ణలతోపాటు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒబిసిల ఆత్మబంధువు బిపి మండల్ : కేసన

బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి
పలుమార్లు శాసనసభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా, గొప్ప సంఘసంస్కర్తగా, 2వ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా, ఓబీసీల అభ్యున్నతి కోసం 27 శాతం విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లతో పాటు,తన నివేదికలో 40 కి పైగా సిఫారసులను ప్రతిపాదించిన ఓబీసీల ఆత్మబంధువు బీపీ మండల్ అని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కొనియాడారు. ఆదివారం బీ.పీ.మండల్ వర్ధంతి సందర్భంగా స్థానిక మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో పలువురు బీసీ నాయకులు మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ బీపీ మండల్ బీహార్ లోని బెనారస్ లోఅత్యంత భూస్వామ్య జమీందారీ యాదవ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించారన్నారు. చిన్నతనం నుండి అత్యంత తెలివైన మండల్ ఉన్నత విద్యలను అభ్యసించడంతో తన 23వ యేట జిల్లా కౌన్సిల్ కు ఎన్నిక కావడం, 1945 - 51 మధ్య, జీతం తీసుకోకుండా జ్యుడిషియల్ మెజిస్ట్రేట్గా పనిచేశారన్నారు. 1952 లోనే బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికై, అధికార పక్షంలో ఉండి కూడా తన బలహీన వర్గాలకు చెందిన కుర్మీలపై, అగ్రవర్ణ రాజపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కే క్రాంతి కుమార్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఉడత శ్రీనివాస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు తిరివీధుల కిరణ్ జిల్లా నాయకులు జన్జనం వరప్రసాద్ ఎనుముల నరసింహారావు ఇసునూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

20న రాష్ట్ర స్థాయి టైలర్ల అసోసియేషన్ ప్రతినిధుల సదస్సు

అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ప్రతినిధులు

ప్రజాశక్తి - మంగళగిరి
మంగళగిరి మసీదు వీధిలోని ఆక్సుర్డ్ టైలర్స్ ఆవరణలో ఆదివారం అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నాగుల మీరా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ టైలర్స్ ఫెడరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకాశపు స్వామి హాజరయ్యారు. సమావేశాన్ని ఉద్దేశించి స్వామి మాట్లాడారు. టైలర్స్ అందరూ ఐకమత్యంతో ఉంటేనే ఏదైనా సాధించగలుగుతామన్నారు. మంగళగిరిలో బిస్మిల్లా వారి సామాజిక భవనంలో ఈనెల 20వ తేదీన రాష్ట్రస్థాయిలో రాష్ట్రంలోని అన్ని టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, అసోసియేషన్ ప్రతినిధులు నల్లమోలు సుబ్రహ్మణ్యం, షేక్ రజాక్, చాదరాజుపల్లి భాస్కర్, మత్రి శివ బ్రహ్మం, బాపనపల్లి అంజయ్య, పఠాన్ నాగూర్ ఖాన్, తిరువీధుల భవన్నారాయణ, సాంబశివరావు, సయ్యద్ యునూష్, నూతన్ ప్రసాద్ పాల్గొన్నారు.

హిందీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి సికె జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన డాక్టర్. వై. లలిత కుమారి జీవిఆర్ హిందీ సేవ పురస్కార సన్మాన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అనేక హిందీ సంబంధిత పోటీలలో కేకే మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అనేక బహుమతులు పొంది సన్మానాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దరియావలి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

131వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి : ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్ష ఆదివారం నాటికి 131 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో డి నాగేశ్వరరావు, సాంబశివరావు, వై నాగేశ్వరరావు, ఎం గురవయ్య, కే హగ్గయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి అంకయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీ నాగేశ్వరరావు, ఎస్ కే ఆరిఫ్, బి.సూర్యప్రకాశ్రావు, ఎం.ఆశీర్వాదం, టి.దుర్గా భవాని, ఎస్ కే మామ్ బి, ఎస్ కే భాష, వై.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సోషలిజంతో అందరికీ మేలు

ప్రజాశక్తి- తాడేపల్లి : సమాజంలోని ప్రజలందరికీ సోషలిజం అనే మహత్తర ఆశయం అమలుతోనే మేలు జరుగుతుందని ప్రజాశక్తి బుక్ ఎడిటర్ ఎస్ వెంకటరావు చెప్పారు. ఆదివారం రాత్రి తాడేపల్లి సుందరయ్య నగర్ విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సిహెచ్ భుజంగరావు అధ్యక్షత వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ కూటం ప్రభుత్వం పై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని విశ్లేషించారు. తాడేపల్లి పట్టణం లోని రైల్వే, ఇరిగేషన్, పోరంబోకు, స్థలాల్లో నివస ముంటున్న అందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యు లు గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో దేశాన్ని వెనక్కి తీసుకెళ్లడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అని చెబుతున్నా పాలకులు, అన్ని పండుగలు కలిపి ఒకేసారి చేయగలవా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు నారిన నాగేశ్వరరావు, ఎస్ గిరిజ, సిహెచ్ భుజంగరావు, బి.రామారావు, కే విజయలక్ష్మి, కొండబాబు, పి రామచంద్రరావు, ఎస్ కే భాష తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి : సుందరయ్య నగర్ ఒకటో రోడ్డులో భక్తుల రాజు భవన్ భవన నిర్మాణ కార్యాలయం సిఐటియు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బైన బోయిన చంద్రశేఖర్, బత్తుల రాజు భవన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన జెడ్‌పి హైస్కూల్ ప్లస్ మహిళా కళాశాల

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ మహిళా కళాశాల విద్యార్థినిలు శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ఉత్తీర్ణతను సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 29 మంది విద్యార్థులు హాజరవ్వగా తొమ్మిది మంది ఉత్తీర్ణతను సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం 21 మంది విద్యార్థులకు గాను పదిమంది ఉత్తీర్ణతను సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని పూజిత 470/445 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని దివ్యశ్రీ 893/1000, ఎస్కే రేష్మ 885/1000 మార్కులతో టాపర్ గా నిలిచారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

సినీ రంగానికి నూతన పాలసీ

- సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- వెస్ట్రన్ లవ్ చిత్రం షూటింగ్‌కు ప్రారంభోత్సవం

షూటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినీ రంగా అభివద్ధికి నూతన పాలసీలను తీసుకురానున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. హైదరాబాదు నుంచి సినీ పరిశ్రమ ఆంధ్ర ప్రదేశ్ కి తరలిరావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో స్టూడియోల నిర్మాణానికి డబ్బింగ్ థియేటర్ల ఏర్పాటుకు అవసరమైన భూములను రాయితీతో అందిస్తామని ఆయన పేర్కొన్నారు. యువతకు బలమైన సందేశాన్ని ఇస్తూ తెరకెక్కుతున్న "వెస్టన్ లవ్" చిత్రానికి ముహూర్తపు క్లాప్‌ను కొట్టి షఉటింగ్ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. బందర్ రోడ్డు లోని శేష సాయి కళ్యాణ మండపంలో ఆదివారం వారాహి ఆర్ట్స్, శక్తి క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న "వెస్టన్ లవ్" చిత్రానికి ముహూర్తపు క్లాప్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొట్టి చిత్ర షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సినిమా స్క్రిప్ట్‌ను ఏపిఎంఎస్ఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా చిత్ర నిర్మాతలు రావి సౌజన్య , దర్శక నిర్మాత కాకర్ల ఎంఆర్ అందుకున్నారు.. జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ యువతకు బలమైన సందేశాన్ని ఇస్తూ "వెస్టన్ లవ్" చిత్రం తెరకెక్కించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు నిర్మాతలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినీ నిర్మాణాలకు ముందుకు రావాలని కోరారు. జనసేన పార్టీ వీర మహిళ నిర్మాత రావి సౌజన్య ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలను స్ఫూర్తిగా తీసుకొని వెస్టన్ లవ్ చిత్రాన్ని నిర్మించడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. రాష్ట్రంలో సినీ నిర్మాణానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చిత్ర నిర్మాణ సంస్థలను ప్రోత్సహించేందుకు నూతన పాలసీని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.. అనంతరం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు స్వామినేని ఉదయభాను మాట్లాడుతూ యువతకు ఒక మంచి సందేశాన్ని అందించాలనే సంకల్పంతో, డ్రగ్స్ అనే సమకాలీన సమస్యను నేపథ్యంగా తీసుకుని, కాలేజీ లవ్ కథాంశంతో "వెస్టన్ లవ్" చిత్రం రూపొందించడం అభినందనీయమన్నారు.

అనంతరం చిత్ర నిర్మాత రావి సౌజన్య మాట్లాడుతూ గేమ్ చేంజర్ చిత్రం ఫ్రీ రిలీజ్ ఈవెంట్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలుగు పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిరావాలని సూచించారని ఆ మాటలను స్ఫూర్తిగా తీసుకొని తాను వెస్టన్ లవ్ అనే చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు నూతన నటీనటులను ఈ చిత్రం ద్వారా వెండితెరకు పరిచయం చేస్తున్నామని ఈ చిత్రం నిర్మాణం ద్వారా ఆంధ్ర రాష్ట్రంలో అనేకమందికి ఉపాధి లభించనుందని అలాగే చిత్రసీమ మొత్తం ఆంధ్ర రాష్ట్రాన్ని తరలివస్తే వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని ఆ దిశగా నిర్మాతలు ఆలోచన చేయాలని ఆమె సూచించారు.

తదనంతరం చిత్ర దర్శకుడు కాకర్ల ఎమ్ ఆర్ మాట్లాడుతూ నేటితరం యువత డ్రగ్స్ కు బానిసలై వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం యువతకు ఒక మంచి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో వెస్టన్ లవ్ అనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఈ చిత్ర సన్నివేశాలు ఈ చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని ఆయన చిత్ర నిర్మాణానికి సహకరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఆయన ప్రత్యేక కతజ్ఞతలు చెప్పారు. అంతర్జాతీయ చిరంజీవి యువత అధ్యక్షులు స్వామి నాయుడు మాట్లాడుతూ జనసేన వీర మహిళ రవి సౌజన్య నిర్మిస్తున్న వెస్టన్ లవ్ చిత్రం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. అనంతరం హీరో రావి రామ్ చరణ్ హీరోయిన్స్ మాహి ,జైశ్విక మాట్లాడుతూ వెస్టన్ కల్చర్ మోజులో పడి యువత డ్రగ్స్ కు బానిస అయి జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారు సే నోటు డ్రగ్స్ అనే నినాదంతో సినిమాను నిర్మిస్తున్నారని ఈ చిత్రం నేటితరం యువతకు ఒక స్ఫూర్తిదాయకంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని కోరారు.... ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్,జనసేన పార్టీ శాసన సభ్యులు చిర్రి బాలరాజు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు రావి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టరు కడలి ఈశ్వరీ, జనసేన వీర మహిళ ప్రతినిధులు కిరణ్ ప్రసాద్,పార్వతీ నాయుడు, పెండ్యాల శ్రీలత, చింతల లక్ష్మీ, చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ ప్రసాద్, కృష్ణ ప్రసాద్, సుగుణ బాబు, కార్పొరేటర్లు అప్పాజీ, మారూపిల్ల రాజేష్, రత్నం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విజేతలు

ఉత్సాహంగా కృష్ణాజిల్లా అండర్-11 చెస్ పోటీలు

ప్రజాశక్తి విజయవాడ అర్బన్: పోరంకిలోని విజ్ఞాన భారతి హై స్కూల్ నందు ఎస్. ఆర్. ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అండర్ - 11 చెస్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. అండర్ -11, బాల, బాలికల చెస్ టోర్నమెంట్ తో పాటు,ఓపెన్ చెస్ టోర్నమెంట్ జరిగిందని కష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్. ఎం.ఫణి కుమార్ తెలిపారు.ఈ టోర్నమెంట్ నందు బాలుర విభాగంలో 19 మంది క్రీడాకారులు, 13 మంది బాలికలు పాల్గొన్నారని తెలిపారు. అండర్ ౹11 చెస్ చాంపియన్షిప్ నందు మొదటి రెండు స్థానాలు సాధించిన వారు వచ్చే వారంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలలో కష్ణా జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు.ఓపెన్ టోర్నమెంట్ నందు 20 మంది క్రీడాకారులు పాల్గొనగా ఐదు రౌండ్లు గా పోటీలు జరిగాయని తెలిపారు.ఈ టోర్నమెంట్ నందు ప్రతి ఏజ్ గ్రూప్ నందు మొదటి రెండు స్థానాలు సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు అందించినట్లు తెలిపారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజ్ఞాన భారతి హై స్కూల్ డైరెక్టర్ కె. ఆర్. ఎస్.రావు, ప్రముఖ న్యాయవాది కె.అజయ్, నగర ప్రముఖులు వై.ప్రియాంక, చీఫ్ ఆర్బిటర్ ఎమ్.పావని పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. బాలుర విభాగంలో సండెన్ సమావెడ్, ఎం.కార్తికేయ ఐదు పోయింట్లుకు 4.5 పాయింట్లు సాధించి మొదటి రెండు స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో టి. ప్రణీత, 5 పాయింట్లు, వై.గుణ శ్రీ 4.5 పాయింట్లు సాధించి మొదటి రెండు స్థానాలు సాధించారు. ఓపెన్ టోర్నమెంట్‌లో రుషీల్ సాయి 4.5 పాయింట్లు, డి.లలిత్ కౌశిక్ 4 పాయింట్లు, కె.సందీప్ 4 పాయింట్లు, ఎ. మణి రత్నం 4 పాయింట్లు సాధించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఎల్ఎ తాతయ్య

ఇంటర్ విద్యార్థిని శ్రీరమ్యకు అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో చెరువు బజారునకు చెందిన కొండ శ్రీ రమ్య పట్టణంలో వాగ్దేవి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ ఇటీవల విడుదల అయిన ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూపు నందు 465/470 మార్కులతో స్టేట్ మూడవ ర్యాంకు సాధించి, జగ్గయ్యపేట చరిత్రలోనే 1991 నుండి ఈరోజు వరకు కూడా మొట్టమొదటిసారిగా వాగ్దేవి కళాశాల నుండి 465/470 మార్కులు సాధించి జగ్గయ్యపేట విద్యారంగ చరిత్రలోనే రికార్డు నెలకొల్పడం జరిగింది. సాధారణ కుటుంబానికి చెందిన శ్రీ రమ్య జగ్గయ్యపేట పట్టణంలో నాగార్జున స్కూల్లో పదవ తరగతి పూర్తి చేసుకుని వివాహం అయినా కూడా చదువుపై ఉన్న ఆసక్తితో చదివి స్టేట్ ర్యాంకు సాధించడం పట్ల స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వారి నివాసంలో శ్రీ రమ్య కు గోల్డ్ మెడల్ తో సత్కరించి,10,000/- రూపాయల నగదు బహుమతిని అందజేశారు. శ్రీ రమ్య లక్ష్యం ఐఐటీలో సీటు సాధించి జగ్గయ్యపేటలో మొదటిసారిగా రికార్డు నెలకొల్పే లక్ష్యానికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకష్ణ, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపల్ డా. బుస్సా సురేష్, కరస్పాండెంట్ బి. సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ప్రజాశక్తి జగ్గయ్యపేట: పట్టణ సమీపంలోని పీవీఆర్ గార్డెన్స్ లో ఆదివారం జయపద్ర ఫౌండేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ పొలిటికల్ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర వైద్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ ఆర్.రాఘవేంద్రరావు, విద్యాభారతి ఉపాధ్యక్షుడు వెలగపూడి రామకష్ణ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి సత్యయ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగానే కాకుండా విదేశాల్లో కూడా ఏడాదంతా చేయించిన ఘనత టిడి జనార్ధన్ సొంతం అని, టి డి జనార్ధన్ రాజకీయ నాయకుడిలా కాకుండా ఒక ఉద్యోగిలా నిరంతరం పార్టీ సేవ చేస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నినాదం కర్మభూమిలో పని చేయండి జన్మభూమికి సేవ చేయండి అనే నినాదంతో జయపద్ర ఫౌండేషన్ సేవలు ఎన్టీఆర్ జిల్లా అంతా విస్తరించాలని కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు కార్యరూపం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 విధానం అన్నారు. సమాజంలో పేదరికం నిర్మూలించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక ఫౌండేషన్ లా తయారైంది అన్నారు. నేటి సమాజంలో హైపర్ టెన్షన్, షుగర్, క్యాన్సర్ వంటివి క్రమంగా పెరుగుతున్నాయని, వీటి పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలి అన్నారు. దేశంలో వినూత్న ఆలోచనలు, కార్యాచరణలో పెట్టే ఇద్దరు ముగ్గురు ముఖ్యమంత్రుల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఒకరని అన్నారు. అనంతరం కళ్లజోళ్లను పంపిణీ నిర్వహించారు.

మూడో రోజుకు బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని తిరుమలగిరి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి మూడో రోజు ఆదివారం శ్రీ స్వామివారి రథోత్సవ కార్యక్రమం దేవాలయం నుండి తిరుమలగిరి గ్రామం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులు స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: రాష్ట్రంలో సాఫ్ట్ టెన్నిస్ దినదినాభివద్ధి చెందుతుందని, స్పోర్ట్స్ కోడ్ ప్రకారం అన్ని సక్రమంగా చేస్తున్న అసోసియేషన్ లలో సాఫ్ట్ టెన్నిస్ ఒకటని ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాభివద్ధి అధికారి ఎస్.ఎ.అజీజ్ అన్నారు. ఆదివారం ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుండి ఆరు సంవత్సరాల్లో ఆరుగురు అంతర్జాతీయ క్రీడాకారులు తయారవ్వడం అసోసియేషన్ యొక్క పట్టుదలకు నిదర్శనమన్నారు. సాఫ్ట్ టెన్నిస్ ఎన్టీఆర్ జిల్లాలో చాలా అభివద్ధి చెందిందని, పతకాలు సాధించడంలో ముందంజలో ఉందన్నారు. విజయవాడలో ఇప్పటికే జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం జరిగిందని, రానున్న రోజుల్లో విజయవాడ నగరం అంతర్జాతీయ టోర్నీ నిర్వహణకు వేదిక కానుందన్నారు. అనంతరం రాష్ట్రం నుండి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.దిలీప్ ప్రసన్న బాబు, అడ్వకేట్ కె.స్టాలిన్, శేఖర్, సుధీర్, జయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.